క్లుప్తంగా

స్వచ్ఛ పొన్నూరుగా మార్చుకుందాం



పొన్నూరు: మున్సిపాలిటీని స్వచ్ఛ పొన్నూరుగా తీర్చిదిద్దేందుకు పట్టణ ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు అన్నారు. స్వచ్ఛతా హి సేవ- 2024 కార్యక్రమంలో భాగంగా ఆదివారం పట్టణంలో 3కే రన్ నిర్వహించారు. కమిషనర్ రమేష్ బాబు మాట్లాడుతూ రహదారులు, వీధుల్లోనూ చెత్తను వేయకుండా పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్లాస్టిక్ వినియోగం పూర్తిగా తగ్గించి, మొక్కలు నాటి పరిరక్షించాల్సిన అవసరం ఉందని చెప్పారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజల భాగస్వామ్యంతో పట్టణంలోని 31 వార్డులను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. స్వచ్ఛతను జీవన విధానంగా మార్చుకుంటామని ప్రతిజ్ఞ చేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వినతి

గుంటూరు రూరల్: డివిజన్ పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని వైఎస్సార్ సీపీ గుంటూరు, పల్నాడు పార్లమెంట్ జిల్లాల పరిశీలకుడు మోదుగుల వేణుగోపాలరెడ్డికి ప్రత్తిపాడు వ్యవసాయ మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ ఆళ్ల రవిదేవరాజు విన్నవించారు. ఆదివారం ఇన్నర్ రింగ్‌రోడ్డులోని మోదుగుల కార్యాలయంలో ఆయనను కలసి ఇటీవల పరిశీలకుడిగా ఎంపికవడంతో పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మోదుగులకు డివిజన్ పరిధిలోని ఏటుకూరు, బుడంపాడు, బొంతపాడు గ్రామాల్లో ప్రజల సమస్యలు, పార్టీ నాయకుల సమస్యలను విన్నవించుకున్నారు. అనంతరం మోదుగుల మాట్లాడుతూ సమస్యలను పార్టీ అధిష్టానికి వివరించి పరిష్కారం దిశగా కృషిచేస్తానని హామీ ఇచ్చారు.

కౌలు రైతులకు నష్టపరిహారం పెంచాలి



పెదకాకాని: వరదలకు పంట నష్టపోయిన కౌలు రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం పెంచాలని సీపీఎం నాయకుడు వై.నేతాజి డిమాండ్ చేశారు. పెదకాకాని మండలంలోని నంబూరు గ్రామ శాఖ మహాసభ ఆదివారం మాకిరెడ్డి పెద సాంబిరెడ్డి భవన్‌లో నిర్వహించారు. సభకు జె.అప్పిరెడ్డి అధ్యక్షత వహించారు. నేతాజీ మాట్లాడుతూ వరదల్లో నష్టపోయిన వరి, పత్తి, మినుము పైర్లకు ముఖ్యంగా కౌలు రైతులు పొలం యజమానులకు అదనంగా కౌలు చెల్లించాల్సి ఉందన్నారు. పెదకాకానిలో ముంపునకు గురై ఇళ్లు మునిగిపోయిన వారిలో కొందరికీ బ్యాంకు ఖాతాల్లో నగదు జమ కాలేదని చెప్పారు. నష్టపోయిన ప్రతి ఒక్కరికి నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. అనంతరం నంబూరు శాఖ కార్యదర్శిగా మన్నెం శ్రీనివాసరావును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ఎస్.శివాజీ, ఎ.వెంకటరెడ్డి, ఎస్.నాగరత్నం, ఎ.నాగలక్ష్మి, ఎం.రాంబాబు, కె.ఆదం, డి.వేణు పాల్గొన్నారు.

ప్రజలకిచ్చిన వాగ్దానాలను ప్రభుత్వం అమలు చేయాలి

పొన్నూరు: బీజేపీ అనుసరిస్తున్న విభజన, విద్వేష రాజకీయాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దండా లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం పొన్నూరు యూటీఎఫ్ కార్యాలయంలో ఎస్.రమేష్‌బాబు అధ్యక్షతన సీపీఎం శాఖ మహాసభ నిర్వహించారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇసుక వెంటనే అందుబాటులోకి తేవాలని, పంట నష్టపోయిన రైతులు అందరికీ పరిహారం ఇవ్వాలని కోరారు. చిరు ఉద్యోగులను రాజకీయ కారణాలతో తొలగించడాన్ని ఆపాలని డిమాండ్‌చేశారు. విశాఖ ఉక్కు కాపాడుకోవడానికి పార్టీలకతీతంగా పోరాట కమిటీని ఏర్పాటు చేసి కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరారు. అనంతరం సీపీఎం పొన్నూరు శాఖ కార్యదర్శిగా గోనిగల ప్రభుదాసును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, ఇసుక అందుబాటులోకి తేవాలని అక్టోబర్ 4న జరిగే ధర్నాలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు.

నేడు డయల్ యువర్ డిపో మేనేజర్

నెహ్రూనగర్: గుంటూరు 2 డిపో పరిధిలో నేడు డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ షేక్ అబ్దుల్ సలామ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డిపో మేనేజర్ కార్యాలయంలో గుంటూరు-హైదరాబాద్, గుంటూరు- తెనాలి, గుంటూరు-విజయవాడ, గుంటూరు - విశాఖపట్నం రూట్లలో తిరుగుతున్న బస్సుల గురించి, సిబ్బంది తీరు గురించి ప్రయాణికులు, విద్యార్థినులు 9959225421 నంబర్‌కు ఫోన్ చేసి తమ సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు.

జలమా.. గరళమా..!

- ప్రత్తిపాడులోని వాటర్ ప్లాంట్ల నుంచి కలుషిత నీరు
- అధికారుల పరీక్షల్లో తేటతెల్లమైన 'కలుషితం'
- రోగాల బారిన ప్రజలు



ఇటీవల సేకరించిన మరికొన్ని తాగునీటి శాంపిల్స్



ఇక్కడ కనిపిస్తున్న ఈ బాటిల్‌లోని నీటిని చూడండి. ఎలా నల్లగా ఉన్నాయో. ఇవి ఆర్వో ప్లాంట్ వాటరే. అవును అధికారులు పరీక్షల కోసం ప్రత్తిపాడులోని ఓ వాటర్ ప్లాంట్ నుంచి సేకరించిన శుద్ధ జలం. పరీక్షల అనంతరం 48 గంటల్లో పసుపు రంగు లేదా తెలుపు రంగులోనికి మారాల్సిన నీరు, 24 గంటల వ్యవధిలోనే ఇలా నల్లగా మారిపోయింది. అంటే నీరు పూర్తిగా కలుషితమయ్యాయన్న మాట. ఈ నీటిని ఎలాంటి పరిస్థితుల్లోనూ ప్రజలు తాగకూడదు. కానీ విషయం తెలియక ప్రత్తిపాడు ప్రజలు ఈ నీటినే తాగుతున్నారు. ఇది ఆ ఒక్క ప్లాంట్ పరిస్థితే కాదు. ప్రత్తిపాడులోని అనేక ప్లాంట్లలో నీరు ఇలానే నలుపు రంగులోనికి మారుతుంది. అవును! ఈ విషయం ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో తేటతెల్లమయ్యింది.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులో పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన ఆర్వో వాటర్ ప్లాంట్‌లు ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుతున్నాయి. నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలిస్తూ, కలుషిత నీటిని సరఫరా చేస్తున్నాయి. ఫలితంగా స్వచ్ఛమైన శుద్ధజలంతో తడవాల్సిన జనం గొంతులు హానికరమైన కలుషిత నీటితో నిండుతున్నాయి. తాగుతున్నది జలమో.. గరళమో అర్థం కాని పరిస్థితి. ప్లాంట్లలో నీరు కలుషితమని పరీక్షల్లో నిర్ధారణ అవుతున్నా, ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నా.. తనిఖీలు చేసి, కఠిన చర్యలకు ఉపక్రమించాల్సిన సంబంధిత శాఖల అధికారులు మొద్దు నిద్ర పోతున్నారు. ఒక్క ప్రత్తిపాడులోనే సుమారు పన్నెండు నుంచి పదిహేను వరకు వాటర్ ప్లాంట్లు ఉన్నాయి.

ప్లాంట్లలో పూర్తిగా కలుషిత నీరు.. టెస్టుల్లో నిర్ధారణ

ప్రత్తిపాడులో చిన్నారులకు శరీరంపై దద్దుర్లు వస్తున్నాయంటూ 'సాక్షి' లో ఇటీవల కథనం ప్రచురితమైన నేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమయింది. జిల్లా కేంద్రం నుంచి వచ్చిన అధికారులు బృందాలుగా ఏర్పడి గ్రామంలో ఇంటింటి పరిశీలనలు చేస్తున్నారు. మరి కొంత మంది సిబ్బంది గ్రామంలో అక్కడక్కడా వాటర్ శాంపిల్స్ సేకరిస్తున్నారు. అందులో భాగంగానే మూడు రోజులుగా స్థానిక ఆరోగ్య సిబ్బంది వాటర్ ప్లాంట్లలోని తాగునీటి శాంపిల్స్ సేకరించి నీటి నాణ్యతా పరీక్షలు చేశారు. నీరు పూర్తిగా కలుషితమని నిర్ధారణ అయింది. రెండు రోజులకు నల్లగా మారాల్సిన నీరు ఒక్కరోజుకే పూర్తిగా నల్లగా మారిపోయాయి. మొత్తం నాలుగు ప్లాంట్లలో శాంపిల్స్ సేకరించగా మూడు ప్లాంట్లలో నీరు ఇలానే నల్లగా మారిపోయినట్లు తెలుస్తోంది. రెండు నెలల కిందట మరికొన్ని వాటర్ ప్లాంట్లలో పరీక్షలు నిర్వహించగా అప్పుడు కూడా ఇదేరకంగా నీరు నల్లగా మారాయి. కొద్ది రోజుల కిందట వరదల సమయంలోనూ ప్లాంట్లలో సేకరించిన శాంపిల్స్ నల్లగా మారాయి. తాజాగా రెండు రోజుల క్రితం సేకరించిన శాంపిల్స్‌లోనూ నీరు కలుషితమని తేలడంతో అధికారులు విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

ఈ నీరు తాగితే లివర్‌తో పాటు చర్మ సమస్యలూ..

ఇలా నీరు నల్లగా మారడానికి కారణం ప్లాంట్ల నిర్వాహకులు ఎప్పటికప్పుడు ఫిల్టర్లు శుభ్రం చేయకపోవడం, క్లోరినేషన్ ప్రక్రియను సక్రమంగా చేయకపోవడంతో నీరు కలుషితం అవుతున్నాయని అధికారులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. ఈ నీరు తాగితే ప్రజలకు లివర్ సంబంధిత సమస్యలు, విరేచనాలతో పాటు శరీరంపై ప్రమాదకరమైన దద్దుర్లు వస్తాయని వైద్య సిబ్బంది, పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చెబుతున్నారు. ప్రత్తిపాడులో పదమూడు వేల మందికి పైగా ప్రజలు ఉన్నారు. వీరిలో దాదాపుగా ఎనభై శాతం మంది ప్రజలు ఈ అనుమతుల్లేని ఆర్వో ప్లాంట్ల నీటిపైనే ఆధారపడుతున్నారు. ఈనేపథ్యంలో ప్లాంట్లు నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చర్యలుతీసుకోకపోతే రానున్న రోజుల్లో భారీ మూల్యం చెల్లించుకోవలసిన పరిస్థితులు కనిపిస్తున్నాయి.

ప్రజలు ఆ నీటిని తాగకూడదు

ప్లాంట్లలో కలుషితమైన ఈ నీటిని ప్రజలు ఎలాంటి పరిస్థితుల్లోనూ తాగకూడదు. అలా తాగితే తీవ్ర అనారోగ్య సమస్యలు వస్తాయి. ఇప్పటికే ప్లాంట్ల నిర్వాహకులు తీవ్రమైన హెచ్చరికలు జారీచేశాం. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించాం.

– జాన్‌పీరా, కార్యదర్శి, ప్రత్తిపాడు పంచాయతీ

ప్రక్షాళనతోనే సమస్యల నుంచి విముక్తి

పొన్నూరు మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు



పొన్నూరు: అపరిష్కృతంగా ఉన్న సమస్యల నుంచి పట్టణానికి విముక్తి కల్పించాలంటే ప్రగతి పనులు చేపట్టడంతోనే ప్రక్షాళన సాధ్యమవుతుందని పురపాలక కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు అన్నారు. ఇటీవల శ్రీకాళహస్తి నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చిన ఆయన పట్టణంలో పట్టణంలోని 31 వార్డులలో పర్యటన పూర్తి చేశారు. ప్రధానంగా అధ్వానంగా డ్రెయిన్లు, కలుషిత తాగునీరు, రోడ్లపై ఆక్రమణలు, అస్తవ్యస్తంగా పారిశుద్ధ్య నిర్వహణ, వెలగని సెంట్రల్ లైటింగ్ వంటి సమస్యలను గుర్తించారు. వాటిని త్వరితగతిన పరిష్కరించడానికి కృషి చేస్తున్నారు. ఆయన మాటల్లోనే..

నిడుబ్రోలులోని జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలను వెంటనే పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నాం. లబ్ధిదారుల సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేలా ముందుకు సాగుతున్నట్లు వివరించారు. మున్సిపల్ కూరగాయల మార్కెట్, షాపింగ్ కాంప్లెక్స్‌లో వ్యాపారుల సమస్యలు తెలుసుకుని, షాపుల అభివృద్ధికి చర్యలు చేపడతున్నట్లు వెల్లడించారు. పట్టణంలో కొన్ని ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఉందని గమనించి, పరిష్కారానికి ప్రణాళికబద్ధంగా పనిచేసేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. ఏడో వార్డు డీవీసీ కాలనీని వరద ముంపునకు గురికాకుండా తుంగభద్ర కాలువతో అనుసంధానంగా ఉన్న డ్రెయిన్ ప్రక్షాళనతోనే సాధ్యమవుతుందని గుర్తించి పురపాలిక ఆధ్వర్యంలో చిత్తశుద్ధితో డ్రెయిన్ పనులు పూర్తి చేసినట్లు చెప్పారు. నిడుబ్రోలులోని టిడ్కో గృహాల్లో సభ నిర్వహించి సమస్యలు తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. తాగునీటి కొరత, లైట్లు, పారిశుద్ధ్య సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. పట్టణంలో 7 వేల వీధిలైట్లు ఉన్నాయి. వాటిలో వెలగని 2 వేల లైట్లు గుర్తించి, ఇప్పటికే వెయ్యి నూతన లైట్లు ఏర్పాటు చేశామని, అన్ని లైట్లు వినియోగంలోకి వచ్చేలా చేస్తున్నామని వెల్లడించారు. దుకాణాల ముందు రోడ్డు చిరు వ్యాపారుల కారణంగా ఆక్రమణలకు గురికాకుండా మార్కింగ్ వేసి, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేసినట్లు చెప్పారు. నిడుబ్రోలు రక్షిత తాగునీటి పథకంలో నూతన వాటర్ బెడ్లు పనులను అక్టోబర్ మొదటి వారంలో ప్రారంభించి, స్వచ్ఛమైన నీటిని ప్రజలకు అందించేలా చర్యలు చేపడతామని కమిషనర్ రమేష్‌బాబు వివరించారు.

నేనూ రైతు కుటుంబం నుంచే వచ్చాను..

జిల్లా ఎస్పీ సతీష్ కుమార్

ప్రత్తిపాడు: వ్యవసాయం లేకపోతే మనం తినడానికి ఏమీ ఉండదని జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ అన్నారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటకు చెందిన దివంగత జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పుటూరి సీతామహాలక్ష్మి జ్ఞాపకార్థం ఉప్పుటూరి చినరాములు సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ఉచితంగా పాడి రైతులకు దాణా, వ్యవసాయ రైతులకు పురుగు మందుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ చేతుల మీదుగా రైతులకు దాణా, పురుగు మందులు అందించారు. ఎస్పీ మాట్లాడుతూ చాలా మంది వ్యవసాయం మరిచి పోవడంతో రియల్ ఎస్టేట్ వచ్చి కట్టడాలు కడుతున్నారన్నారు. అయినప్పటికీ రైతులు ఉండబట్టి ప్రపంచమంతా హ్యాపీగా బతుకుతున్నారని చెప్పారు. అలాంటి రైతులను కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. నేను కూడా ఒక రైతు కుటుంబం నుంచి వచ్చానని, ఇది చెప్పుకోవడం గర్వకారణంగా ఉందని పేర్కొన్నారు.



పుల్లడిగుంటలో రైతులకు దాణా అందజేస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

అందరూ కలిసిమెలిసి ఉండాలి..

గ్రామాల్లో అందరూ కలిసి మెలిసి ఉండాలని ఎస్పీ అన్నారు. గొడవలు, సమస్యలు వచ్చినప్పుడు ఎస్ఐ, సీఐ, ఎస్పీ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరిస్తామని చెప్పారు. రాజకీయమనేది ఓటు వెయ్యడం వరకే ఉండాలని, ఓటు అనేది మీ హక్కని, అంతేగానీ దాన్ని ఆధారంగా చేసుకుని గొడవలు చేయాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో ఉప్పుటూరి చిన రాములు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వీధి కుక్కలపై ప్రత్యేక దృష్టి

- ప్రతి రోజూ వందకు తగ్గకుండా ఏబీసీ ఆపరేషన్లు
- నగర కమిషనర్ పులి శ్రీనివాసులు



అధికారులకు సూచనలు చేస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ ఏబీసీ సెంటర్‌లో ప్రతి రోజు వందకు తగ్గకుండా వీధి కుక్కలకు యాంటీ బర్త్ కంట్రోల్(ఏబీసీ) సర్జరీలు చేసేలా చర్యలు తీసుకోవాలని, అందుకు అవసరమైన చర్యలు సదరు కాంట్రాక్ట్ సంస్థ చేపట్టాలని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. ఆదివారం ఏటుకూరు రోడ్‌లోని ఏబీసీ సెంటర్, వర్మీ కంపోస్ట్ యూనిట్, వెంగళాయపాలెంలోని గోశాలలను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. తొలుత ఏబీసీ సెంటర్‌లోని ఆపరేషన్ థియేటర్, ఆపరేషన్ అనంతరం కుక్కలను ఉంచుతున్న ప్రాంతాలు, వాటికి అందిస్తున్న ఆహారం, చికిత్స విధానాలను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు తెస్తున్న కుక్కలు, ఆపరేషన్ చేసిన కుక్కల వివరాలను రిజిస్టర్‌లో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో వీధి కుక్కలపై నియంత్రణపై పలు ఫిర్యాదులు అందుతున్నాయని, వాటి నియంత్రణకు ఏటుకూరు రోడ్‌లోని ఏబీసీ సెంటర్‌లో స్నేహ యానిమల్ వెల్ఫేర్ సొసైటీ వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేస్తుందన్నారు. ప్రతి రోజు వంద కుక్కలకు ఆపరేషన్లు జరిగేలే ఏజెన్సీ తగిన ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు. అందుకు తగిన విధంగా మౌలిక వసతులను జీఎంసీ కల్పిస్తుందన్నారు. ఆపరేషన్ జరిగిన కుక్కలకు నిర్దేశిత సమయం వరకు ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచాలని, తగిన చికిత్స, ఆహారం అందించాలని కోరారు. ఏబీసీ సెంటర్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. నగరంలో ఏ వీధిలో నుంచి తెచ్చిన కుక్కలను ఆపరేషన్ అనంతరం అదే వీధిలో విడిచిపెట్టాలని కోరారు. వర్మీ కంపోస్ట్ యూనిట్‌ని పరిశీలించి, నగరంలోని జీఎంసీ పార్క్‌లో, డివైడర్ల మధ్యలోని మొక్కలకు అందించాలని ఆదేశించారు. కంపోస్ట్ యార్డ్‌ని పరిశీలించి, నగరంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు జిందాల్ ప్రాజెక్ట్‌కి తరలించాలన్నారు. అనంతరం వెంగళాయపాలెంలోని గోశాలను పరిశీలించి, ఎన్ని ఆవులు ఉన్నదీ, వాటికి అందిస్తున్న ఆహార వివరాలు అడిగి తెలుసుకొని, పరిసరాలు బురదగా ఉండడం గమనించి ప్రాంగణం ఫ్లోరింగ్ చేయడానికి, నూతన షెడ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పర్యటనలో సిటీ ప్లానర్ డి.రాంబాబు, ఈఈలు సుందరరామిరెడ్డి, కొండారెడ్డి, ఎంహెచ్‌ఓలు మధుసూదన్, ఆనందకుమార్, రాంబాబు, డీఈఈ సతీష్, ఏసీపీ మురళీ, టీపీఎస్ సువర్ణ కుమార్, ఏఈ రవి కిరణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దాసరి ఏడుకొండలు, మల్లికార్జునరావు, స్నేహ యానిమల్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతోనే ఆరోగ్యం

గుంటూరు రూరల్: చిరుధాన్యాలతో ఆరోగ్యంగా జీవించవచ్చని మిల్లెట్ రాంబాబు తెలిపారు. ఆదివారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట, రైతునేస్తం ఫౌండేషన్‌లో ఏర్పాటు చేసిన రైతుశిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గతంలో వరి, గోధుమలు రాకమునుపు అందరూ చిరుధాన్యాలను ఆహారంగా తీసుకుంటూ ఉండేవారని, కాని వివిధ రకాల కారణాల వల్ల మన ఆహారంలో వరి, గోధుమలు చేరి చిరుధాన్యాలను పక్కకు నెట్టి ఈ రెండు ధాన్యాలే ప్రధాన ఆహారంగా మారాయన్నారు. వరి, గోధుమలలో మనిషికి అవసరమైన అన్ని రకాల పోషకాలు సమపాళ్లలో ఉండవని, మనకు అవసరమైన పోషకాలు ఉన్న ధాన్యాలు చిరుధాన్యాలన్నారు. కాని వరి, గోధుమలు తినడానికి అలవాటు పడిన ప్రజలు చిరుధాన్యాలు సరిగ్గా రుచిగా ఉండడం లేదన్నారు. వీటిని తమ ఆహారంలో చేర్చుకోలేపోతూ ఆరోగ్యాలను పాడు చేసుకుంటున్నారన్నారు. శ్రద్ధతో వంట చేసుకున్నట్లయితే చిరుధాన్యాలతో రుచికరమైన వంటకాలు చేసుకోవచ్చని వీటితోనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని తెలిపారు. జొన్నలు, సజ్జలు, రాగులు, కొర్రలు, వరిగలు, ఆరికలు, సామలు, ఊదలు, అండుకొర్రలు లాంటివి చిరుధాన్యాలని వివరించారు. కార్యక్రమంలో రైతునేస్తం ఫౌండేషన్‌చైర్మన్ వై.వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.



చిరుధాన్యాల గురించి వివరిస్తున్న మిల్లెట్ రాంబాబు

నేడు ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణ

నెహ్రూనగర్: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక సోమవారం నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు తమ స్థానిక సమస్యలపై అర్జీలు అందజేయవచ్చని చెప్పారు.

ఖాళీ స్థలాలు.. వ్యాధులకు ఆవాసాలు



నేతాజీనగర్‌లో ఇళ్ల మధ్య చెట్లతో నిండిన ఖాళీ స్థలం



నిడుబ్రోలు 8 వార్డులో పెరిగిన చెట్లు

పొన్నూరు: పట్టణ పరిధిలో ఖాళీ స్థలాలను అధికారులు పట్టించుకోవడం లేదు. భూములు కొనుగోలు చేసిన వారు నిర్వహణను వదిలేయడంతో ఆయా ఖాళీ స్థలాల్లో చెట్లు, పిచ్చి మొక్కలు పెరిగి పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. మున్సిపల్ అధికారులు శ్రద్ధ పెట్టకపోవడంతో ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు, ముళ్ల కంపలు పెరిగి అపరిశుభ్రతకు నిలయాలుగా మారాయి. కొన్ని స్థలాలు రోడ్డు కంటే పల్లంలో ఉండటంతో వర్షపు నీరు వెళ్లే మార్గం లేక చెరువులను తలపిస్తున్నాయి. దీంతో ఆవాస కేంద్రాలుగా మారడంతో పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటువంటి అపరిశుభ్ర వాతావరణం వల్లే వ్యాధులు ప్రబలుతున్నాయని స్థానికులు వాపోతున్నారు.

సృజనాత్మకతను వెలికితీసేందుకే కథల పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసి, ఉపాశక్తిని పెంపొందించేందుకే కథల పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తెలిపారు. జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఏసీ కళాశాలలో ఆదివారం పాఠశాల స్థాయి విద్యార్థులకు కథల పోటీలు నిర్వహించారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ కథలు రాసేందుకు విద్యార్థులు ఉత్సాహంగా తరలిరావడం అభినందనీయమన్నారు. విద్యార్థులు రాసిన కథల నుంచి ఎంపిక చేసిన కథలను గుంటూరు జిల్లా పిల్లల కథలు పేరుతో విద్యార్థి పేరు, ఫొటో, పాఠశాల, తల్లిదండ్రుల పేర్లతో పుస్తకాన్ని ముద్రిస్తామని వివరించారు. ఏసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మోజెస్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆలోచనా శక్తి, మేధాశక్తిని పెంపొందించేందుకు జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో కథల పోటీలు నిర్వహించడం మంచి విషయమన్నారు. ఈసందర్భంగా ప్రజా గాయకుడు పీవీ రమణ బాల్యం ఆట, పాటలకు దూరమవుతున్న తీరును వివరిస్తూ ఆలపించిన పాట ఎంతో ఆకట్టుకుంది.

ప్రమాదాల నివారణకు కల్వర్టు



12వ తేదీన సాక్షిలో ప్రచురితమైన వార్త



కల్వర్టు నిర్మిస్తున్న దృశ్యం

పొన్నూరు: పట్టణం నుంచి ఇటికంపాడు రోడ్డులోని మసీదు వద్ద డ్రెయిన్‌పై ఉన్న గుంత ప్రమాదాలకు నెలవుగా మారింది. ఈ నేపథ్యంలో ఆదమరిస్తే ఆపదే శీర్షికన ఈ నెల 12వ తేదీన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. కమిషనర్ ముప్పాళ్ల రమేష్ బాబు ఆదేశాలతో ఇంజినీరింగ్ విభాగం కల్వర్టు నిర్మాణ పనులు చేపట్టింది. యుద్ధ ప్రాతిపదికన నిర్మాణ పనులు చేస్తున్నారు. ప్రమాదాలను నివారించే దిశగా అధికారుల చర్యలకు స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.